క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం పరిశీలన



వనపర్తి రూరల్: మండలంలోని నాచహల్లి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను బుధవారం ఎంపీడీఓ రాఘవ పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం అక్కడే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పాఠశాలకు విద్యార్థులు సక్రమంగా హాజరయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. చిన్నారుల మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని హెచ్‌ఎంకు ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి నూతన్ తదితరులు ఉన్నారు.

కేతేపల్లి పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలకు రత్నగిరి ఫౌండేషన్, కొల్లాపూర్ వారు పంపించిన రెండు కంప్యూటర్లను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు విష్ణు హెచ్‌ఎం శ్రీనివాసులుకు అందజేశారు. పాఠశాల అభివృద్ధి కోసం మంత్రి జూపల్లి సహకారంతో తప్పక తోడ్పాటునందిస్తామన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

ఆత్మకూర్: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా స్వాధీనం చేసుకున్న ఫోన్లను బాధితులకు బుధవారం అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్‌కు చెందిన ట్రాన్స్‌కో ఉద్యోగి అనిల్‌కు చెందిన ఫోన్ నవంబర్ 30న కురుమూర్తి జాతరలో, పెబ్బేరుకు చెందిన తిరుపతయ్య నవంబర్ 21న ఆత్మకూర్‌లో పండ్లు కొనుగోలు చేస్తుండగా ఫోన్ చోరీ కాగా బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని గుర్తించి రికవరీ చేశామన్నారు.

అయ్యప్ప పడిపూజ



ఆత్మకూర్: హరిహరపుత్ర అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి ఆత్మకూర్‌లోని ఎంవీరామన్ హైస్కూల్‌లో మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రముఖ వేదపండితుడు గోపాలకృష్ణ గురుస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరచింత, ఆత్మకూర్, మదనాపూర్, చింతకుంట మండలాలకు చెందిన అయ్యప్ప మాలధారులు హాజరయ్యారు. కార్యక్రమంలో వీరేశలింగం, విఠల్‌రావు, సిరాజ్, బాలీరాజు, చంద్రయ్య, వేణురెడ్డి, శ్రీధర్‌జ్యోషి, భీమన్న, గురుస్వాములు కూరగాయల రఘు, దివాకర్, భరత్, బాలు, తోటరవి పాల్గొన్నారు.

నాసాపై విద్యార్థులకు అవగాహన



వనపర్తి విద్యావిభాగం: నాసాపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని జీహెచ్‌ఎం గణేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో ప్రతి సంవత్సరం నిర్వహించే నాసా కాంటెస్ట్ 2024-2005లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ అమెరికాలో గల నాసాకు పంపించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ జవహర్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎం గణేష్ నాసా ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించి, నాసా కిట్లను అందజేశారు.

కంటి వైద్య పరీక్షలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో మొత్తం 225 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు హెచ్‌ఎం కాళిదాసు, వైద్యులు స్వప్న, రఘు తెలిపారు. వారిలో 9 మంది విద్యార్థులకు కంటి లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

సాక్షి, నెట్‌వర్క్: యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుల ఎన్నికల ఫలితాలను బుధవారం టీపీసీసీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఆత్మకూర్ మండల అధ్యక్షుడిగా వంశీ, వీపనగండ్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజశేఖర్, అమరచింత యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మిట్టనందిమళ్ల గ్రామానికి చెందిన లాల్‌కోట శరత్‌కుమార్, పెద్దమందడి మండల అధ్యక్షుడిగా మహేందర్ ఎంపికయ్యారు.

మది నిండా 'కురుమయ్య'

- కురుమూర్తిస్వామివారి సేవలో మహిళలు
- కొత్తకోట, మదనాపూర్‌కు చెందిన 20మంది
- పౌర్ణమి, అమావాస్య రోజున..



కురుమయ్య సేవలో పాల్గొన్న మహిళలు (ఫైల్)

మదనాపురం: పేదల తిరుపతిగా వెలుగొందుతున్న కురుమూర్తిరాయ స్వామివారిని భక్తులు ఆరాధ్య దైవంగా కొలుస్తారు. ఇక్కడ కొలువైన పద్మావతి సమేత శ్రీకురుమూర్తి స్వామివారిని నమ్మకంతోని మొక్కుకొని కొబ్బరికాయ కొట్టి, దాసంగాలు సమర్పిస్తే భక్తులకు సమస్యలన్నీ తీరతాయని విశ్వాసం. శ్రీకురుమూర్తి స్వామి వేంకటేశ్వరుడి అవతారంలో పూజలందుకుంటున్నారు. గర్భగుడిలో స్వామివారి దివ్యరూపం అద్భుతంగా ఉంటుంది. ప్రతి పౌర్ణమి, అమవాస్య పర్వదినాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తారు.

20 మంది జట్టుగా..

నిత్యం కుటుంబ బాధ్యతలతో ఉండే మహిళలు స్వామి సేవలో తరిస్తూ భక్తులకు సేవలందిస్తున్నారు. కొత్తకోట, మదనాపురం మండలాలకు చెందిన 20 మంది మహిళలు ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజున కురుమూర్తి స్వామి ఆలయానికి వచ్చి స్వామి వారి కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. ప్రధానంగా బ్రహ్మోత్సవాలు జాతర కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతిరోజు వచ్చి సేవ చేస్తున్నారు. స్వామివారి చెంతకొచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్ దర్శనం, ప్రధాన మెట్ల గుండా వస్తున్న భక్తులకు సహాయం చేయడం, దివ్యమెట్ల గుండా జనం గుంపులుగుంపులుగా నిలబడకుండా భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా చూడడంపై వంటి పనులు చేస్తున్నారు. వీరు రెండేళ్లుగా కురుమూర్తి సేవలో పునీతులవుతున్నారు.

డ్రెస్ కోడ్ ఏర్పాటు

కురుమూర్తి సేవలో తరించేందుకు వస్తున్న మహిళలు ప్రధానంగా డ్రెస్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. భక్తులందరి మాదిరిగా కాకుండా తమను నేరుగా గుర్తించేందుకు డ్రెస్ కోడ్‌ను ధరిస్తున్నారు. రాజాగోపురం, మోకాళ్లగుండు, ఆంజనేయస్వామి ఆలయం, కొండమీద ముఖద్వారం, ఉద్దాల మండపం మెట్లు, ఉద్దాల మండపం, లడ్డు ప్రసాదం తయారీ కేంద్రం, ప్రధాన ఆలయం మెట్లు, చెన్నకేశవ స్వామి ఆలయం, పద్మావతి దేవి ఆలయం పరిసరాల్లో భక్తుల సేవలో వీరు తరిస్తున్నారు. ఆలయం నుంచి ఏమి ఆశించకుండా తమ సొంత ఖర్చులతో వచ్చి స్వామి సేవలో భాగస్వాములవుతుండడంతో భక్తులు వీరిని అభినందిస్తున్నారు.

అదృష్టంగా భావిస్తున్నా



నేను కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ స్వామివారి సేవలో పాల్గొంటున్నా. రెండేళ్లుగా ప్రతి అమవాస్య, పౌర్ణమితో పాటు జాతర సమయంలో వస్తున్నా. హుండీ లెక్కింపులో మేము భాగస్వామి కావడం చాలా ఆనందంగా ఉంది. పూర్వజన్మ సుకృతంగా భావిస్తా.

– విజయలక్ష్మి, కానాయపల్లి, కొత్తకోట

రెండేళ్లుగా..



కురుమూర్తి సేవలో పనిచేయడం ఎంతో భాగ్యంగా భావిస్తాను. రెండేళ్లుగా ఇక్కడే స్వామి సేవలో ఉంటున్నాం. మా కుటుంబాన్ని స్వామి వారు కాపాడుతున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా స్వామివారి దర్శనం చేయించేందుకు కృషి చేస్తున్నాం.

– లక్ష్మి, భక్తురాలు, కొత్తకోట

మహిమ గుర్తించాను



సర్వేశ్వరుడి మహిమ గుర్తించాను. స్వామి వారు నన్ను, మా పిల్లలను, కుటుంబాన్ని కంటిరెప్పల కాపాడుతున్నారు. స్వామివారికి సేవ చేయడం పూర్వ జన్మ సుకృతం.

– స్వప్న, భక్తురాలు, కొత్తకోట

అతుకుల భవనానికి రూ.40లక్షలు



మున్సిపాలిటీ కార్యాలయం లోపల కూలిన ఫాల్‌సీలింగ్

అమరచింత: మున్సిపల్ కార్యాలయం కోసం పట్టణంలోని పీఏసీఎస్‌కు చెందిన గోదాంను వినియోగించుకునేందుకు మున్సిపల్ కార్యాలయం నుంచి రూ.40 లక్షలు వెచ్చించారు. పాత గోదాంను సరికొత్త భవనంగా రూపుదిద్దినా.. కేవలం నాలుగేళ్ల కాలం దాటక ముందే మున్సిపల్ భవనంలోని పై భాగం వేసిన ఫాల్ సీలింగ్ కూలిపోవడంతో అధికారుల పనితనంపై పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రూ.40 లక్షలతో ప్రభుత్వ స్థలంలో కొత్త మున్సిపల్ కార్యాలయమే నిర్మించుకునే అవకాశం ఉన్నా.. మున్సిపల్ చైర్‌పర్సన్, పాలక మండలి సభ్యులు ఆదేశంతో రూ.40 లక్షలు మంజూరు చేసి సదరు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయ్యారని మూడో వార్డు కౌన్సిలర్ బాహటంగా విమర్శలు చేశారు. అతుకుల భవనంగా తయారైన మున్సిపల్ కార్యాలయ మరమ్మతులపై సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గోదాం ప్రారంభం

మదనాపురం: పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం మండలంలోని అజ్జకొల్లులో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఎఫ్‌సీఐ గోదాంను ప్రారంభించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో సైన్స్ ల్యాబ్ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. కార్యక్రమంలో మార్కెట్ చెర్మన్ పల్లెపాగ ప్రశాంత్, వైస్ చెర్మన్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆశాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశాలు

వనపర్తి రూరల్: ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మరికుంట నుంచి ఆశా కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఏఓకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు, ఆశా వర్కర్స్ జిల్లా కార్యదర్శి సునీత మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, టీబీ పరీక్షల పెండింగ్ డబ్బులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్, బొబ్బిలి నిక్సన్, నందిమల్ల రాములు, గిరిజ, ఇందిర, జ్యోతి, లత, సత్యమ్మ, సుజాత, మంజుల, జిలేక, శ్యామల, అరుణ, చిట్టెమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై ఫిర్యాదు

పాన్‌గల్: ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌పై ఫిర్యాదు చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి చెందిన వంగ సుమిత్రమ్మ గత నెల 28వ తేదీన కొల్లాపూర్ నుంచి వనపర్తి వెళ్తున్న కొల్లాపూర్ డిపో బస్సులో కొల్లాపూర్‌లో బస్సు ఎక్కింది. ఆమె మండలంలోని కేతేపల్లిలో బస్సు దిగుతుండగా డ్రైవర్ సతేశ్వరం అజాగ్రత్తగా, అతివేగంగా బస్సును నడపడటంతో ఆమె కిందపడి రెండు కాళ్లకు రక్తగాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత మహిళ అల్లుడు రసాల యుగేందర్‌గౌడు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం



అమరచింతలోని ఎంబీ కర్మేల్ చర్చిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కమిషనర్ నురుల్ నదీం

అమరచింత: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నురుల్‌నదీం అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని నాల్గో వార్డులో గల ఎంబీ కర్మేల్ చర్చిలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని ఆయా వార్డుల్లోని ప్రజలు తమ ఇళ్ల పరిసరాలు, వ్యక్తిగత మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఈసుప్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను విస్మరించొద్దు

వనపర్తి టౌన్: ఏళ్ల తరబడి ఆటోలను నడుపుతూ జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులను ప్రభుత్వం విస్మరించొద్దని నూతనంగా ఎన్నికైన ఆటో యూనియన్ అధ్యక్షుడు తాత రాములు, ప్రధాన కార్యదర్శి జె.వెంకటరమణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆటో యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గట్టుయాదవ్, పలుస రమేష్‌గౌడ్, నందిమల్ల అశోక్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, గంధం పరంజ్యోతి, తిరుమల్, అధ్యక్షుడిగా తాతా రాములు, ప్రధాన కార్యదర్శిగా జె.వెంకటరమణ, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఎండా పాషా, బి.శ్రీనివాసులు, రఫియొద్దీన్, శివాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లపై అధికారుల వేధింపులు ఆపాలని, ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేసేందుకు..

పాన్‌గల్: విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు, విద్యా విధానం ఎలా ఉందో తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షనే న్యాస్ (నేషనల్ ఆచీవ్‌మెంట్ సర్వే) అని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పీఎస్ చిక్కేపల్లి, పీఎస్ రేమద్దుల, న్యూవిజన్ స్కూల్ రేమద్దుల, ఉన్నత పాఠశాల కేతేపల్లి పాఠశాలల్లో నిర్వహించే పరీక్షలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. నాలుగేళ్లకోసారి జాతీయ సాధన సర్వే పరీక్ష నిర్వహిస్తోందని, దేశ వ్యాప్తంగా ఏక కాలంలో ఈ పరీక్ష కొనసాగిందన్నారు. 3, 6, 9 తరగతులకు చెందిన 115 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారని తెలిపారు. పరీక్షను పర్యవేక్షించేందుకు 9మంది ఫీల్డ్ ఇన్విజిలేటర్లు, ఆరుగురు అబ్జర్వర్లు పనిచేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

ఆత్మకూర్: విద్యార్థుల్లో ఉన్న సామర్థ్యాలను వెలికితీసి, సృజనాత్మకతను పెంపొందించడానికి పోటీ పరీక్షలు దోహదపడుతాయని మండల విద్యాధికారి కొండాపురం బాలరాజు అన్నారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను వెలికితీసేందుకు దేశవ్యాప్తంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా 3, 6, 9వతరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

పోటీ పరీక్షలతో విద్యార్థులకు ప్రయోజనం

వీపనగండ్ల: వివిధ అంశాలపై విద్యార్థులకు తరచూ పోటీలు నిర్వహించడం వల్ల వారిలోని సృజనాత్మకతను వెలికి తీయొచ్చని జిల్లా పరిశీలకులు చంద్రశేఖర్, గణేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ పాఠశాల, కల్వరాల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేను ఆయన పరిశీలించారు. 3, 6, 9 తరగతులకు గణితము, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానంపై విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు ఈ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అబ్జర్వర్లుగా శ్రీనివాసమూర్తి, మండల విద్యాధికారి నర్సింహులు, హెచ్‌ఎం సాయిలత, ఉపాధ్యాయులు రంజిత్, దేవేందర్, రవికుమార్, భారతి, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కేతేపల్లిలో న్యాస్ పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు



ఆత్మకూర్‌లో..

కలుషిత ఆహారంతో విద్యార్థులకు ఇబ్బందులు



ఆత్మకూర్: కలుషిత ఆహారం తిని విద్యార్థులు చస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని, పురుగుల బియ్యం, కుళ్లిపోయిన కూరగాయలతోనే వంటలు వండుతున్నారని బీఆర్‌ఎస్‌వీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని బాలకిష్టాపూర్ కేజీబీవీలో బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు రియాజ్‌అలీ ఆధ్వర్యంలో సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ శివప్రసాద్ యాదవ్, జిల్లా కోఆర్డినేటర్ హేమంత్ మాట్లాడుతూ కేజీబీవీలో కుళ్లిన కూరగాయలు వండుతున్నారని అన్నంలో పురుగులు ఉన్న విద్యార్థులకు అలాగే వడ్డిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో అమరేందర్, లక్ష్మణ్‌గౌడ్, అఖిలేందర్, శివప్రసాద్‌గౌడ్, నవాజ్‌షరీఫ్, భాను ఉన్నారు.

'మొక్కల కొనుగోళ్లలో చేతివాటం'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్: కార్మికుల వేతనాలు, అత్యవసర పనులకు రూ.లక్ష లోపు ఖర్చు చేసే జనరల్ ఫండ్ నిధులను బీఆర్‌ఎస్ హయాంలో మాజీ చైర్మన్ గట్టుయాదవ్ దారి మళ్లించి చేతివాటం ప్రదర్శించారని మున్సిపల్ చైర్మన్ మహేష్ ఆరోపించారు. బుధవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నివాసంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనరల్ ఫండ్ నిధులను కేవలం నలుగురు, ఐదుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల వార్డులకు కేటాయించి మున్సిపాలిటీని ఆర్థికంగా దెబ్బతీశారని ఆరోపించారు. వనపర్తి రోడ్ల మధ్యలో రూ.వేలు ఖర్చుతో కొనుగోలు చేసి నాటిన మొక్కలు నీరు పోసినా బతకడం లేదని, వాటిని అవినీతి వాటాల కోసం నాసిరకం మొక్కలు తెచ్చారన్నారు. తప్పుడు జీఓలతో కాంట్రాక్టర్లతో పనులు చేయించుకొని వారిని నరకయాతన పెట్టిన ఘనత గట్టుయాదవ్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ మాట్లాడుతూ ఎంబీ రికార్డుల్లో అధికారికంగా చైర్మన్ సంతకం అవసరం లేకున్నా.. వాటిని తప్పనిసరి చేసి గట్టుయాదవ్ అవినీతికి పాల్పడ్డాడన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటేష్, ఎల్.సతీష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



నియామక పత్రాలు అందజేస్తున్న బీజేపీ జిల్లా నాయకులు

వనపర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సందా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చందాపురంలో బీజేపీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయనతో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో బూత్ కమిటీల అధ్యక్షులను నియమించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలం కావడంతో ప్రజలు కాంగ్రెస్‌పై అసంతృప్తితో ఉన్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రైమోటార్ సైకిల్ అందజేత



శ్రీదేవికి ట్రై మోటార్ సైకిల్ అందిస్తున్న కృష్ణప్రసాద్ యాదవ్

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన మానపాడు శ్రీదేవికి కాళ్లు సరిగా లేక భూమిని పట్టుకొని నడుస్తుండటంతో ఆమెను చూసి చలించిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కృష్ణప్రసాద్ యాదవ్ తన మిత్రుడు రేమొద్దుల ఖతాల్ సహకారంతో మూడు చక్రాల మోటార్ సైకిల్‌ను అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీదేవి తండ్రి అనారోగ్యంతో, సోదరుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తన తల్లితో కలిసి గ్రామంలో జీవనం సాగిస్తుందన్నారు. ఆమె పడే బాధను చూడలేక సాయం చేశామని పేర్కొన్నారు. దివ్యాంగురాలికి సాయం చేయడంపై పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీచుపల్లి యాదవ్, బిచ్చన్న, భాస్కర్ యాదవ్, నీలయ్యయాదవ్, సత్యనారాయణ, వెంకట్రాముడు, కృష్ణయ్య, మద్దిలేటి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలను సీజ్ చేయాలి



స్వర్ణభారతి కళాశాలను సందర్శించిన ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి ఆంజనేయులు

పెబ్బేరు రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కళాశాలలను సీజ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని స్వర్ణ భారతి ఒకేషనల్ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఇప్పటి వరకు ఈ కళాశాలకు బోర్డు అనుమతి ఇవ్వలేదని, నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అడ్మిషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. బోర్డు అనుమతి లేకపోవడం వల్ల వార్షిక పరీక్షల ఫీజు గడువు ముగియడంతో 22 మంది విద్యార్థుల భవిష్యత్ రోడ్డున పడిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే బోర్డు అధికారులు స్పందించి కళాశాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు ఈ అకాడమిక్ ఇయర్ నష్టపోకుండా చూడాలని కోరారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే వివరాల నమోదు



వివరాలను నమోదు చేస్తున్న ఆపరేటర్లు

పాన్‌గల్: మండలంలో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి సేకరించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ గోవింద్‌రావు బుధవారం తెలిపారు. మండలంలోని 28 జీపీల్లో సర్వే వంద శాతం పూర్తి కావడంతో మొత్తం 12,090 ఇళ్ల ద్వారా సేకరించిన వివరాలను ఎంపీడీఓ కార్యాలయంతో పాటు ఎమ్మార్సీ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు ప్రైవేట్ ఆపరేటర్లు కూడా ఆన్‌లైన్ నమోదుకు వినియోగిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు దాదాపుగా 95 శాతానికి పైగా నమోదు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

'మందకృష్ణ మాదిగను విమర్శిస్తే సహించం'



మాట్లాడుతున్న కొమ్ము చెన్నకేశవులు మాదిగ

వనపర్తి టౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను వ్యక్తిగతంగా విమర్శిస్తున్న వర్గీకరణ వ్యతిరేకులారా ఖబడ్దార్.. తీరు మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ యువజన సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 30ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేసి సామాజిక న్యాయమైన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సాధించిన యోధుడు మందకృష్ణ మాదిగ అని కొనియాడారు. వర్గీకరణను వ్యతిరేకించే స్వార్థపరులైన కొందరు మాల మనువాదులు రిజర్వేషన్ల దోపిడీకి మరిగి 58కులాల వాటాను ఒక్క కులమే 30 ఏళ్లుగా అనుభవిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రులు, సుప్రీంకోర్టు రాజ్యాంగ విస్తృత ధర్మాసనం, ముఖ్యమంత్రులు, వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, ప్రజాస్వామ్యవాదులందరూ వర్గీకరణకు అనుకూలంగా ఉన్న విషయం తెలిసి కూడా స్వార్థ బుద్ధితో వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి రావడం కోసమే, స్వలాభం కోసం పరేడ్ గ్రౌండ్‌లో మాలల సభను నిర్వహించారని విమర్శించారు. కార్యక్రమంలో గంధం గట్టయ్య, పరశురాముడు, పెరుమల్ల రామకృష్ణ, బాలరాజు, రాజు తదితరులు ఉన్నారు.

పరువు హత్యలు, అత్యాచారాలపై పోరాడాలి



బాలమల్లేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: రాష్ట్రంలో జరుగుతున్న పరువు హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీపీఐ కార్యాలయంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ మృతి సందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం పరిధిలోని రాయపూర్ పోలీస్ కానిస్టేబుల్ కొంగర నాగమణి కులాంతర వివాహం చేసుకుందని, పరువు పేరుతో సొంత తమ్ముడు హత్య చేయడం దుర్మార్గమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహం చేసుకున్న కూతుళ్లను కుటుంబ సభ్యులు దారుణంగా చంపేస్తున్నారని వాపోయారు. మహిళలు, బాలికలపై హత్యలు, అత్యాచారాలు పెరిగి కేసులు నమోదవుతున్నా శిక్షలు మాత్రం పడటం లేదని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ భూమిక, శిరీష, సీపీఐ నాయకులు రమేష్, శ్రీరామ్, గోపాలకృష్ణ, లక్ష్మీనారాయణలున్నారు.